## క్లుప్తంగా

### దెబ్బతిన్న పంటల పరిశీలన



నేలకొరిగిన వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ ప్రసాద్ రావు

**అవుకు:** మండల కేంద్రం అవుకు సమీపాన అకాల వర్షాలకు దెబ్బతిన్న వరిపైరును మంగళవారం ఏఓ ప్రసాద్ రావు పరిశీలించారు. నేల వాలిన పైరును కాపాడుకునేందుకు తీసుకోవాల్సి జాగ్రత్తలను ఈ సందర్భంగా ఏఓ రైతులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నష్టం వాటిల్లిన పైరు వివరాల నమోదు చేపట్టామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15 వరకు అవకాశం ఉందని, బాధిత రైతులు ఆర్బీకేలలో వ్యవసాయ సహాయక సిబ్బందిని కలిసి నష్టం విరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు సింధియా, రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

### విద్యార్థినిని అభినందించిన చల్లా శ్రీలక్ష్మి



మానసను సత్కరిస్తున్న చల్లా శ్రీలక్ష్మి

**అవుకు:** పదవ తరగతిలో అత్యధికంగా 566 మార్కులు సాధించిన పట్టణానికి చెందిన డ్రైవర్ గాజుల శేఖర్ కుమార్తె గాజుల మానసను మంగళవారం స్థానిక చల్లా కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి అభినందించారు. విద్యార్థినికి బొకే అందజేసి శాలువా కప్పి అభినందించిన చల్లా శ్రీలక్ష్మి మంచి లక్ష్యాన్ని ఎంచుకోవాలని, తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో చల్లా రాజ్యాభిషేక్ రెడ్డి, జూనియర్ చల్లా రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

### ఆరోగ్య సూత్రాలు పాటించాలి

**కోవెలకుంట్ల:** గర్భిణులు తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలు పాటించాలని రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభానీ సూచించారు. పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాలకు చెందిన గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు, తదితర పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్లు గర్భిణులకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు గిరిజ, వీరభద్రుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఏసు మార్గంలో నడవాలి

**కోవెలకుంట్ల:** ఏసుక్రీస్తు బోధించిన శాంతి మార్గంలో పయనించాలని చర్చి పాదర్లు విజయ్ కుమార్‌బాబు, జకరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని గుళ్లదూర్తి సీఎస్ఐ చర్చి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంది రమే దేవుని హృదయమని, క్రైస్తవ సోదరులు ప్రార్థనలు నిర్వహిస్తూ దేవుని కృపకు పాత్రులు కావాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు బుచ్చన్న, సతీష్, సాల్మన్, బాల స్వామి, గంగన్న, సాదయ్య, సభ్యులు కరుణాకర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### భూసార పరీక్షలపై అవగాహన కల్పించాలి

**బనగానపల్లెరూరల్:** రైతులకు భూసారపరీక్షలపై అవగాహన కల్పించాలని ఏడీఏ రాజశేఖర్ సూచించారు. మంగళవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఏఓ సుబ్బారెడ్డి అధ్యక్షతన ఏఈఓ, ఎంపీఈఓలతో సమావేశం జరిగింది. ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట దిగుబడులను రక్షించుకునే విధంగా రైతులకు సూచనలు, సలహాలను ఇవ్వాలని సూచించారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నిమిత్తం మండలంలోని ఆరు రైతు భరోసా కేంద్రాల్లోని గిడ్డంగుల్లో 20 మెట్రిక్ టన్నుల యూరియా, కాంప్లెక్స్ ఎరువులను ముందుస్తుగా రైతులకు అందుబాటులో ఉంచినట్లు ఏడీఏ తెలిపారు. అనంతరం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణ యజమానులతో ఏడీఏ సమావేశం నిర్వహించారు.

### ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు

**బనగానపల్లెరూరల్:** పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన బుర్రకథ కళాకారుడు సంకుల బుర్రకథల జమ్మయ్యను వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం మండల అధ్యక్షులుగా నియమించారు. దీంతో మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆయన స్వగృహంలో కలిసిన జమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జమ్మయ్య మాట్లాడుతూ తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో తన బుర్రకథ కళను ప్రదర్శించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే తనపై నమ్మకంతో మండల వైఎస్సార్‌సీపీ సాంస్కృతి విభాగం అధ్యక్షునిగా నియమించడం జరిగిందని, కాటసాని సాయాన్ని మరువనని తెలిపారు. కార్యక్రమం లో ఆటోబాబు, నంది, మురళి, ఉస్సేని, రాజు, శ్రీకాంత్, శివ కుమార్,బెండు ఉస్సేని తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో వేషధారణల దృశ్యం

## కమనీయం... విఠలేశ్వరుడి రథోత్సవం

**కోవెలకుంట్ల:** పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి రథోత్సవం మంగళవారం కమనీయంగా జరిగింది. మంగళవాయిద్యాలు, డ్రమ్స్, డప్పులతో అశేష జనవాహిని మధ్య రంగరాజుపేట, సంతపేట, అమ్మవారిశాల, గాంధీసెంటర్ వరకు రథోత్సవం సాగింది. కళాకారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేతోపాటు ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి, ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్‌గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, మాజీ సర్పంచ్‌లు వాసగిరి సాయికృష్ణమూర్తి, వాసగిరి శోభారాణి, కర్రా తేజారెడ్డి, పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, న్యాయ విభాగ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి తదితరులు స్వామివారికి పూజలు నిర్వహించారు.



రథోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్త జనం

## రమణీయం... చెన్నకేశవుడి రథోత్సవం



రథోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తజనం

**అవుకు:** శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి తిరుకల్యాణ మహోత్సవాలను పురష్కరించుకొని మంగళవారం అవుకు పట్టణంలో నిర్వహించిన చెన్నకేశవుడి రథోత్సవ రమణీయంగా సాగింది. రాజవంశీయుడు త్రివిక్రమ వర్మ, అవుకు మండల ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇతర చల్లా కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేద మంత్రాలను పటిస్తూ రథోత్సవాన్ని ప్రారంభించారు. తేరువీధి నుంచి ప్రారంభమైన రథోత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్దెత్తున పాల్గొని గోవింద నామస్మరణలు చేస్తూ తేరును లాగారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడంతో అవుకు పట్టణం కిటకిటలాడింది.



చెన్నకేశవ స్వామి రథోత్సవంలో పాల్గొన్న చల్లా కుటుంబ సభ్యులు

## జగనన్నకు చెబుదాంతో ప్రజలకు మరింత చేరువ

- మున్సిపల్ చైర్మన్ రాజేష్

**డోన్ టౌన్:** జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు మరింత చేరువై సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందజేస్తారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటేశులు అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా మంగళవారం మున్సిపల్ సమావేశం భవనంలో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో వారు కౌన్సిలర్లతో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మరింత జవాబుదారి తనంగా ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. అర్హత ఉండి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తించని పేలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఎంతో ఉపయోగం అన్నారు. సంక్షేమ పథకాల మంజూరులో ఎదురయ్యే సమస్యలు, ఇప్పటి వరకు చేసిన ప్రయత్నాలు వాటి విశ్లేషణ తదితర వాటికి పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, మల్లికార్జునరెడ్డి మేకల విమల, వెంకటేశ్వరమ్మ, పోలయ్య, ఆర్ట్ రమణ, మిట్టా ఉమామహేశ్వరి, మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు

## ప్రజలకు మరింత చేరువగా...'జగనన్న'!

- పేదలందరికీ న్యాయం చేసేందుకే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

**బనగానపల్లె:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని, ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేసేందుకు జగనన్న మరో ముందడుగు వేశారన్నారు. మంగళవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్నకు చెబుదాం' ప్రారంభ కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీడియే కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీఓ శివరామయ్యతో కలిసి ఎమ్మెల్యే వీక్షించారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. అయినా టెక్నికల్, తదితర సమస్యల మూలంగా ఏ ఒక్కరూ నష్టపోకూడదనే సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందని పేదలు నేరుగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని సీఎం కల్పించారని, విన్నపాలను నేరుగా సీఎం కార్యాలయం పర్యవేక్షిస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమం చేపట్టడం సాహసోపేతమని, ప్రజలకు ఇంకా మెరుగైన పరిపాలన అందించాలన్న సీఎం జగనన్న నిర్ణయం అభినందనీయమన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా పేదలందరికీ న్యాయం చేయడమే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా 1902కు పోన్ చేసి విన్నవించాలని, సమస్య ఎంత వరకు వచ్చిందన్న విషయాన్ని ఎప్పటికప్పుడు సీఎం కార్యాలయం ద్వారా మీ మొబైల్‌కు మేసేజ్ వస్తుందని వివరించారు.



జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

## హోరాహోరీగా గార్ధబాల పరుగు పందెం

**కోవెలకుంట్ల:** పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురష్కరించుకుని మంగళవారం నిర్వహించిన గార్ధబాల పరుగుపందెం పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఎనభైపళ్ల ఇసుక మూట బరువుతో పది నిమిషాల కాల వ్యవధిలో నిర్వహించిన పోటీల్లో జిల్లాతోపాటు వైఎస్సార్ జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది గార్ధబాలు పోటీల్లో పాల్గొన్నాయి. వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం జంగాలపల్లెకు చెందిన అంజి గార్ధభం ప్రథమ స్థానంలో నిలిచి రూ. 10వేలు బహుమతి కైవసం చేసుకుంది. ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి నాగవైష్ణవి గార్ధబం ద్వితీయ స్థానంలో రూ. 5వేలు, అవుకు మండలం మెట్టుపల్లెకు చెందిన పెద్దయ్య గార్ధబం తృతీయ స్థానంలో రూ. 3వేలు దక్కించుకున్నాయి. వెలగటూరు గ్రామ సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి, పట్టణానికి చెందిన చాకలి శ్రీనివాసులు, నాగేంద్ర, పుల్లయ్య ఆర్థిక సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు.



హోరాహోరీగా సాగుతున్న గార్ధబాల పరుగుపందెం పోటీలు

## సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు

**కోవెలకుంట్ల:** రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు ఏఓ నిరంజన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్కో రైతుకు 50 శాతం సబ్సిడీతో పది కిలోల జీలుగ విత్తనాలను రూ. 395, ఎనిమిది కిలోల పిల్లిపెసర విత్తనాలను రూ. 388 ప్రకారం అందజేస్తున్నామన్నారు. రైతులు ఆర్‌బీకేల్లో విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

### సబ్సిడీని సద్వినియోగం చేసుకోండి

**అవుకు:** ప్రభుత్వం జీలుగలు, పిల్లిపెసరను 50శాతం సబ్సిడీపై అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ప్రసాద్ రావు మంగళవారం తెలిపారు. అవుకు మండలానికి 82 క్వింటాళ్ల జీలుగలు, 10 క్వింటాళ్ల పిల్లిపెసర మంజూరయ్యాయన్నారు. సాధరణంగా జీలుగలు క్వింటా ధర రూ.7,900 ఉండగా ప్రభుత్వ సబ్సిడీ పోనూ రూ.3,950, పిల్లిపెసర క్వింటా ధర రూ.9,700 ఉండగా సబ్సిడీ పోనూ రూ.4,850 రైతులు చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు.

## ఏటీఎంలో రూ. 500 దొంగనోటు

**బేతంచెర్ల:** పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో రూ.500 దొంగ నోటు వచ్చినట్లు డోన్ మండలం దేవర బండ కు చెందిన లారీ డ్రైవర్ రాఘవేంద్ర తెలిపారు. దేవర బండకు చెందిన రాఘవేంద్ర బేతంచెర్ల పట్టణంలో లారీ డ్రైవర్‌గా ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు.

మంగళవారం సాయంత్రం డ్యూటీ దిగి బేతంచెర్ల పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలోకి వెళ్లి రూ. 9,500 డ్రా చేశాడు. డబ్బులు ఎంచుకునే క్రమంలో ఒక దొంగనోటు కన్పించడంతో వెంటనే యాక్సిస్ బ్యాంక్ సిబ్బందిని సంప్రదించగా మేనేజర్ సెలవుల్లో ఉన్నాడని ఆయన వచ్చిన తరువాత ఫిర్యాదు చేయాలని సూచించారు. దొంగనోటు వచ్చిన విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు రాఘవేంద్ర తెలిపాడు.

### చిన్నారులను ఆదుకోవాలి

**డోన్ టౌన్:** పిడుగు పాటుతో మృతి చెందిన ఉలవ లక్ష్మిదేవి కుటుంబానికి రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి అనాథలైన చిన్నారులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మావతి, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, డోన్ మండల కార్యదర్శి వెంకట రాముడు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం యర్రగుంట్ల గ్రామానికి వెళ్లి ఆమె మృత దేహంపై పూల మాలలు ఉంచి నివాళులర్పించారు. ఏడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో భర్త, ప్రస్తుతం లక్ష్మిదేవి మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారని ఆవేదన వ్యక్తం చేసిన వారు ఈ ముగ్గురు పిల్లలకు గురుకుల పాఠశాల్లో సీట్లు కేటాయించి ఆదుకోవాలని అధికారులను కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్యాపిలి:** మండల పరిధిలోని జలదుర్గం వద్ద 11 కేవీ లైన్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జలదుర్గం, రామకృష్ణాపురం, మాధవరం, గార్లదిన్నె తదితర గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

### వైఎస్సార్ బీమా సాయం అందజేత

**డోన్ టౌన్:** మండల పరిధిలోని కన్నపకుంట గ్రామానికి చెందిన రవి మంగళశారం మృతి చెందాడు. ఈ మేరకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10 వేలను గ్రామ సచివాలయ సంక్షేమ అధికారి లతీఫ్‌తో కలిసి సర్పంచ్ కళ్యాణి అందజేశారు.

### బాధితునికి ఫోన్ అందజేత

**బేతంచెర్ల:** బనగానపల్లెకు చెందిన రవి కుమార్ వస్తువు కొనుగోలుకు బేతంచెర్లకు వచ్చి దుకాణంలో సెల్ ఫోన్ మరిచి వెళ్లిపోయాడు. దీంతో దుకాణ దారుడు సీఐ ప్రియతం రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఐ బాధితుడిని పిలిపించి సెల్ అందజేశాడు.

## ఐక్యమత్యంగా మెలగాలి

**అవుకు:** బలిజలు ఐకమత్యంగా మెలగాలని, ఒకరికొకరు సహాయ సహకారాలు అందించాలని కర్నూలు జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ ఆర్టీఓ, కోనేటి చంద్రబాబు తెలిపారు. అవుకు బలిజ సంఘం కార్యాలయంలో మంగళవారం స్థానిక నాయకులతో ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు కోనేటి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన సమావేశమయ్యారు. సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించిన కోనేటి చంద్రబాబు బలిజలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేందుకు నాయకులు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పట్టణానికి చెందిన ఆకుల సుబ్బయ్య ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు కునుకుంట్ల రమణ, పొన్నపాటి రమణ, వేటూరి రమణ, జక్కా మధు, శనగల వెంకటేశ్వర్లు, మామిళ్లసుబ్బన్న, జానపాటి ప్రసాద్, వేణుగోపాల్, వరప్రసాద్, పోతుల మురళి, చిన్న కంబగిరిస్వామి, కునిగారి హరిప్రతాప్, రామకృష్ణ, ఉపేంద్ర, నీలి భాస్కర్, మునిమడుగు రవి, ప్రకాశ్, కోనేటి రవి తదితరులు పాల్గొన్నారు.



బాధితునికి నగదు అందిస్తున్న నాయకులు

## వ్యక్తి ఆత్మహత్య

**బనగానపల్లెరూరల్:** మండలంలోని మీరాపురం గ్రామానికి చెందిన వడ్డె వెంకటసుబ్బయ్య (38) మంగళవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ దంపతులు కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అయితే వెంకటసుబ్బయ్య కొన్ని నెలల నుంచి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం భార్య చెల్లెలు వివాహానికి గోవిందపల్లెకు భార్యపిల్లలతో కలిసి వెళ్లాడు. పుట్టింటివారి విన్నపం మేరకు భార్యపిల్లలను అక్కడే ఉంచి స్వగ్రామం మీరాపురానికి వచ్చాడు. అనారోగ్యపరిస్థితుల కారణంగా జీవితం విరక్తి చెంది ఇంట్లో ఉన్న సిలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. సాయంత్రం వరకు తలుపులు తీయక పోవడంతో గమనించిన ఇరుగుపోరు ఫ్యాన్‌కు ఉరివేసుకొని విగతజీవిగా వేలాడుతుండడం చూసి కుటుంబ సభ్యులకు సమచారం ఇచ్చారు. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పేదల కుటుంబాల్లో నవరత్నాల వెలుగులు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

**కొలిమిగుండ్ల:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. మంగళవారం తిమ్మనాయినపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పరంగా ఆయా కుటుంబాలకు వర్తించిన సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జగనన్న ఎన్నికల ముందు చేసిన పాదయాత్రలో ప్రతి ప్రాంతంలో పేదలు పడుతున్న కష్టాలను స్వయంగా చూసి చలించిపోయారన్నారు. ఆ కష్టాలు తీర్చేందుకే అధికారంలోకి రాగానే నవరత్నాల పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గత ప్రభుత్వంలో పాలన ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉంది అనే విషయాన్ని ప్రతిఒక్కరూ పరిశీలించుకోవాలన్నారు. జగనన్న కాలనీల ద్వారా పేదల సొంతింటి కల నేరవేరుస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నా ప్రతి పక్షాలు బురద జల్లేందుకు విమర్శలు చేస్తున్నారన్నారు.

### సమస్యలు తెలుసుకునేందుకు మీవద్దకు

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే మీ వద్దకు వస్తున్నామని, ఇలాంటి కార్యక్రమం ఇంతవరకు ఏ నాయకుడూ చేపట్టలేదని ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. అమ్మవారి శాల వీధి, వాల్మీకి, ఎస్సీ కాలనీల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. పింఛన్లు మంజూరు చేయించాలని పలువురు ఎమ్మెల్యేకు విన్నవించగా అర్హులందరికీ వచ్చేలా చూడాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఆదేశించారు. కాలనీల్లో తాగునీటి పైపులైన్ లేనందున ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యేకు చెప్పగా జలజీవన్ మిషన్ పథకం ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, గ్రామ నాయకులు పండ్ల కుమార్, బాసు, సుబ్బయ్య, శేష ఫణిస్వామి, నారాయణ, మదార్, ఓబులేసు, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

## సంక్షిప్తం

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

**అవుకు:** మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి మంగళవారం తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారన్నారు.

### రూ. 24వేలు ఆదాయం

**డోన్ టౌన్:** వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు తొమ్మిది వాహనాలకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఈ మేరకు రూ. 24వేల ఆదాయం వచ్చిందని పట్టణ సీఐ శేషయ్య, తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. జీఎస్టీ రూ. 4,300వసూలు చేశామన్నారు.

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

**బేతంచెర్ల:** సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసి ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో బాధితులు పోలీస్ స్టేషన్ ఆశ్రయించారు. బేతంచెర్ల ఎస్ఐ శివ శంకర్ నాయక్ వివరాలు ఇలా ఉన్నాయి. హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన పువ్వాడ వేణుకుమార్ దగ్గర రూ.60 వేలు, బనగానపల్లె మండలం పండ్లాపురం గ్రామానికి చెందిన శివ బాలజీ దగ్గర రూ.1.60 లక్షలు చొప్పున అదే మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన నవీన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని వసూలు చేశాడు. ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో మోసపోయామని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పువ్వాడ వేణుకుమార్, శివబాలజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### శ్రీ మద్దిలేటి స్వామి ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

**బేతంచెర్ల:** మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పాణ్యం మండలం తొగర్చేడు గ్రామం వైఎస్సార్‌సీపీ నాయకులు కాచిరెడ్డి మాధవ రెడ్డి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడుకు మంగళవారం అందజేశారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించారు.

### రేవనూరు ఇన్‌చార్జ్ ఎస్ఐగా మౌలానీ

**కోవెలకుంట్ల:** మండలంలోని రేవనూరు పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఐగా మౌలానీకి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న మహమ్మద్ రిజ్వాన్ కర్నూలు జిల్లా మద్దికెర పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారన్నారు. ఆ స్థానంలో జిల్లా పోలీసు అధికారులు రెగ్యులర్ ఎస్ఐని నియమించక పోవడంతో తాత్కాలింగా కోవెలకుంట్ల ఎస్ఐగా పనిచేస్తున్న మౌలానీకి అదనపు బాధ్యతలు ఇచ్చామన్నారు.

### కంటైనర్‌ను ఢీకొన్న కారు

**డోన్ టౌన్:** మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో కంటైనర్‌ను కారు ఢీకొంది. బెంగళూరు చెందిన వినద్ తన కుటుంబ సభ్యులతో హైదరాబాద్ నుంచి వెళ్తున్నాడు. అదేవైపు వెళ్తున్న కంటైనర్‌ను ఉడుములపాడు సమీపంలో ఓవర్ టేక్ చేసే క్రమంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్యామేజ్ అయ్యింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఏలాంటి గాయాలు కాలేదు.

### అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

**బేతంచెర్ల:** భర్త అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నాడని మంగళవారం పట్టణంలోని బేగరిపేట కాలనీకి చెందిన ఓ మహిళ పోలీసు స్టేషన్ ఆశ్రయించింది. హెడ్ కానిస్టేబుల్ ఎం.వీ రమణ వివరాల మేరకు బేగిరిపేట కాలనీకి చెందిన మసి సునితతో కర్నూలు పట్టణానికి చెందిన దేవినేని యోగితో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్ని రోజులుగా అదనపు కట్నం కోసం మసి సునితను భర్త వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### వాహనాల తనిఖీ

**సంజామల(కోవెలకుంట్ల):** సంజామల మండలం ముదిగేడు గ్రామం వద్ద ఎస్ఐ ప్రతాప్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వివిధ ప్రాంతాలవైపు వెళుతున్న వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్ ధరించిన వాహన చోదకలకు జరిమానా విధించారు.